క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



అలంపూర్: మున్సిపాలిటీలోని 8వ వార్డు న్యూప్లాట్స్ కాలనీలో బీసన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. విషయం తెలుసుకున్న వివేకానంద యూత్ సభ్యులు దాతల సాయంతో బీసన్న కుటుంబానికి మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వివేకానంద యూత్ సొసైటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

డ్రైవర్‌పై కేసు నమోదు

ఉండవెల్లి: ఈ నెల 10వ తేదీన ఆయిల్ ట్యాంకర్ అదుపుతప్పి బోల్తా పడిన విషయం విధితమే. ఈ ఘటనపై మంగళవారం డ్రైవర్‌పై కేసు నమోదైంది. ఎస్‌ఐ బాలరాజు వివరాల ప్రకారం పుల్లూరు టోల్‌గేట్ సమీపంలో తమిళనాడు నుంచి బెంగుళూరుకు ప్రయాణిస్తున్న ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ ఓ వాహనాన్ని ఓవర్ టేక్ చేస్తుండగా అదుపు తప్పి బోల్తా పడింది. ఈ విషయమై వీఎం ట్రాన్స్‌పోర్టు యజమాని గుండ్రాతి విజయభాస్కర్ గౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డ్రైవర్ రాజ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మత్తు పదార్థాలతో అనారోగ్యం

అయిజ: మత్తు పదార్థాలతో అనారోగ్యానికి గురవుతారని షీటీం కళాబృందం, ఎస్సై నరేష్ కుమార్ అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని బింగుదొడ్డిలో మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా సైబర్ నేరాలు, బాల్య వివాహాలతో కలిగే నష్టాల గురించి వివరించారు. 100 డయల్ గురించి, మహిళలకు భరోసా కేంద్రం సేవల గురించి తెలిపారు. విద్యార్థినులు వేధింపులకు గురైతే 87126 70312కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో షీ టీం సభ్యులు, పోలీస్ బృందం పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన



మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం దీర్ఘకాలిక వ్యాధులపై డాక్టర్ ఇర్షాద్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నావారు తప్పకుండా మందులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు చంద్రన్న, సంధ్యారాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్యనందించాలి



ధరూరు: విద్యార్థులకు అర్థమయ్యేవిధంగా బోధించాలని అదేవిధంగా గుణాత్మక విద్యనందించాలని జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐఈసీ విద్యా విధానంలో సమూహంగా బోధించేటప్పుడు తరగతి గదిలో విద్యార్థుల నుంచి మనం ఆశించిన ఫలితాలు రాబట్టామా లేదా అని రివ్యూ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్లు సీతంనాయుడు, రవిప్రకాష్, పరుశరాముడు ఐఈసీ మండల కో ఆర్డినేటర్ వెంకటేష్, సీఆర్‌పీ నర్సింహులు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మైనార్టీ చైర్మన్‌గా కిఫాయతుల్లా

గద్వాల అర్బన్: కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిపార్ట్‌మెంట్ జోగుళాంబ గద్వాల జిల్లా చైర్మన్‌గా కిఫాయతుల్లాను నియమించారు. ఈ సందర్భంగా ఆయన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్ రెడ్డిలకు మంగళవారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

కాళ్లకు చెక్కల సాయంతో పాదయాత్ర

మానవపాడు: అంతర్రాష్ట్ర రహదారిపై కర్ణాటక రాష్ట్రం, బిజాపూర్ జిల్లా, ముద్యావిహార్ మండలానికి చెందిన అందువాలికర్ భక్తుడు శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్నాడు. మంగళవారం మండలంలోని చంద్రశేఖర్‌నగర్ సమీపంలోని అంతర్రాష్ట్ర రహదారిపై కాళ్లకు చెక్కలు కట్టుకొని పాదయాత్ర చేస్తుండగా స్థానికులు ఆయన పలకరించారు. కర్ణాటక నుంచి 350 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేస్తున్నానని వివరించాడు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు



మానవపాడు పరీక్ష కేంద్రంలో..



అయిజ కళాశాలలో సూచనలిస్తున్న తహసీల్దార్ లక్ష్మి

మానవపాడు: ఇంటర్మీడియట్ పరీక్షలకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం మండల కేంద్రంలో గంగు వెంకటకృష్ణారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఎంపీడీఓ రమణరావు, ఆర్‌ఐ రజనీకాంత్‌రెడ్డి పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమారాలు ఏర్పాటు చేశామని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఫర్నీచర్, మరుగుదొడ్లు, ఎలాంటి సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 15 నుంచి 29 వరకు ఇంటర్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం చీఫ్ సూపరింటెండెంట్ నర్సింహులు, అధికారి రాజేశ్వర్‌లు పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం 473 మంది విద్యార్థులు, ఇంటర్ రెండో సంవత్సరం 445 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానునట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గట్టు: ఇంటర్ పరీక్షలు దృష్ట్యా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని మంగళవారం తహసీల్దార్ జుబేర్ అహ్మద్, డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్‌లు పరిశీలించారు. మొదటి సంవత్సరం పరీక్షలకు 342 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 274 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్ శశిధర్‌రెడ్డి, డిపార్టుమెంట్ అధికారి రామకృష్ణలు తెలిపారు.

అయిజ: ఇంటర్ పరీక్షల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను చేయాలని తహసీల్దార్ లక్ష్మి ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను తహసీల్దార్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాములతో మౌలికవసతులపై చర్చించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కళాశాల ఆవరణలో 144 సెక్షన్ ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పదిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



నర్సరీని పరిశీలిస్తున్న ముషాయిదాబేగం

ఎర్రవల్లిచౌరస్తా: పదిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యమని జెడ్పీ డిప్యూటీ సీఈఓ ముషాయిదాబేగం అన్నారు. మంగళవారం ఇటిక్యాల మండలంలోని వేముల గ్రామ పంచాయతీని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో గ్రామ స్థాయి పరిరక్షణ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులకు 1098 సేవలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రణాళిక బద్ధంగా చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకొని గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అదేవిధంగా గ్రామంలోని నర్సరీని సందర్శించి మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పట్టాలని నిర్వాహకులకు సూచించారు. గ్రామ పంచాయతీలో రికార్డులను తనిఖీ చేశారు. ఎప్పటికప్పుడూ వివిధ పనుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీశైలం, కార్యదర్శి నరేష్ కుమార్, తదితరులు ఉన్నారు.

తాగునీటిని సరఫరా చేయండి

అయిజ: రంజాన్ పండుగ సందర్భంగా పట్టణంలో తాగునీటి సరఫరాకు ఆటంకం లేకుండా చూడాలని మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్యకు ముస్లింలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం పనులు చేపట్టాలని, ముళ్ల కంచెలను తొలగించాలని, కాలువల్లో పూడిక తీయించాలని, వీధిలైట్లు మరమ్మతులు చేయాలని కోరారు.

ఆడపిల్లలు ఉన్నత విద్యను అభ్యసించాలి

మానవపాడు: ఆడపిల్లలు ఉన్నత విద్యను అభ్యసించి స్థిరపడాలని ఎంపీడీఓ రమణరావు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని జల్లాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాలిక సంక్షేమం, విద్య, సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటమే లక్ష్యం



పాటను విడుదల చేస్తున్న రంజిత్ కుమార్

గద్వాల అర్బన్: ప్రజా సమస్యలపై పోరాటమే లక్ష్యం పనిచేస్తామని నడిగడ్డ హక్కుల పోరాట సమితి చైర్మన్ రంజిత్‌కుమార్ అన్నారు. మంగళవారం ఈనెల 17 నుంచి నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆత్మ గౌరవ పాదయాత్రకు సంబంధించిన పాటను జిల్లా కేంద్రంలోని ఆ సమితి కార్యాలయంలో మంగళవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను సంఘటితం చేస్తూ, ఓటు విలువ తదితర అంశాలపై పాదయాత్రను చేపడుతునట్లు చెప్పారు. మేధావులు, విద్యార్థులు, రైతులు, కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బుచ్చిబాబు, లవన్న, తిమ్మప్ప, భూపతి తదితరులు ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా తప్పిన ప్రమాదం

ఎర్రవల్లిచౌరస్తా: జాతీయ రహదారిపై ఓ ట్రాక్టర్ ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడటంతో పెను ప్రమాదం తప్పిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పెబ్బేర్ మండలంలోని జనుంపల్లి నుంచి మిరప పిప్పితో వెళ్తున్న ఓ ట్రాక్టర్ ఎర్రవల్లి చౌరస్తాలోకి రాగానే ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ వాసుతో పాటు అందులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. 44వ జాతీయ రహదారి నుంచి గద్వాలకు వెళ్లే మలుపులో ట్రాక్టర్ బోల్తా పడటంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాక్టర్‌ను, మిరప పిప్పిని జేసీబీ సహాయంతో తొలగించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.

బాలల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి



నోట్ బుక్‌ను అందజేస్తున్న సీడీపీఓ

రాజోళి: బాలల పరిరక్షణపై పరిరక్షణ కమిటీలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సీడీపీఓ సుజాత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం, బాలలను పనిలో పెట్టుకోవడం చట్ట విరుద్ధమన్నారు. వీటి వల్ల కలిగే అనార్థాలను పిల్లల తల్లదండ్రులకు ఎప్పటికప్పుడు తెలపాలని సూచించారు. అనంతరం పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, ఎంవీ ఫౌండేషన్ మండల కో ఆర్డినేటర్ హనిమి రెడ్డి, సురేష్, సుధాకర్ పాల్గొన్నారు.

జీతాలు చెల్లించకుంటే ఆందోళనలు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శాంతినగర్: గ్రామ పంచాయతీ కార్మికుల జీతాలు వెంటనే చెల్లించకపోతే ఆందోళనలు చేపడతామని వడ్డేపల్లి మండల ఐఎఫ్‌టీయూ కార్మికసంఘం అధ్యక్షుడు మధు హెచ్చరించారు. మంగళవారం ఆ సంఘం ఆధ్వర్యంలో వడ్డేపల్లి మండల సీనియర్ అసిస్టెంట్ రాములుకు వినతిపత్రం అందజేశారు. నాలుగు నెలలుగా జీతాలు రాక పస్తులుంటూ పంచాయతీ కార్మికులు పనిచేస్తున్నారన్నారు. పారిశుద్ధ్య కార్మికులను పట్టించుకున్న పాపానపోలేదన్నారు. నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో గ్రామ పంచాయతీ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. నాలుగువేల మందికి పైగా పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో కార్మికులకు 2021 పీఆర్సీ నివేదిక ప్రకారం అమలు చేస్తోందని, పారిశుద్ధ్య కార్మికులకు వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జమ్మిచేడు కార్తీక్, దేవన్న, వెంకట్రాముడు, మద్దిలేటి, రవి, నర్సింహులు, రంగస్వామి పాల్గొన్నారు.

నిరంతరం విద్యుత్ సరఫరా చేయండి

అలంపూర్: రైతులకు నిరంతరాయంగా 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని బీఎస్పీ నాయకులు కోరారు. అలంపూర్ చౌరస్తాలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏఈ సుబ్బరాయుడుకు బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు మహేష్, ఉపాధ్యక్షుడు సుంకన్న, మండల అధ్యక్షుడు నాగరాజు, కన్వీనర్ సురేష్‌లు వినతిపత్రం అందజేశారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా అలంపూర్ మండలం గొందిమల్ల గ్రామాన్ని పర్యటించినట్లు తెలిపారు. ఈ గ్రామంలో 90 మంది వ్యవసాయ చేసి జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లిన పరిష్కారానికి ముందుకు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి గ్రామంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని వినతిలో కోరారు.

ఆలయ ఆర్చిగేట్ స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న దేవస్థానం అధికారులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర ఆలయాలకు సంబంధించి యాత్రికుల రాక కోసం ఏపీలోని కర్నూలు జిల్లా బ్రాహ్మణ కొట్కూర్ దగ్గర ఆర్చిగేటు నిర్మించేందుకు ఆలయ ఈవో పురేందర్, చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిలు మంగళవారం బ్రాహ్మణకొట్కూరు వెళ్లి క్షేత్రస్థాయిలో స్థలాన్ని పరిశీలించారు. అలంపూర్ తుంగభద్ర నదిపై బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడంతో ఇటీవల కాలంలో భక్తులు పెద్ద ఎత్తున ఈ మార్గం గుండా బ్రాహ్మణకొట్కూర్ నుంచి శ్రీశైలానికి వెళ్తున్నారు. ఆర్చిగేటు నిర్మాణానికి కర్నూలు చందన బ్రదర్స్ వారు ముందుకు వచ్చారు. దీంతో చందనా బ్రదర్స్ మేనేజర్, ఆలయ ఈవో చైర్మన్‌లు స్థలాన్ని పరిశీలించారు. అక్కడి ఆర్‌అండ్‌బీ అధికారులు, గ్రామ పంచాయతీ సమీప నివాసాల దగ్గర నుంచి ఎన్‌వోసీ తీసుకుంటే ఆర్చిగేటు నిర్మిస్తామని చందనాబ్రదర్స్ ప్రతినిధి తెలిపారు.

భక్తులకు అన్నదానం



గట్టులో మజ్జిగ అందజేస్తున్న యువకులు

జోగుళాంబ శక్తిపీఠం: కర్ణాటక నుంచి శ్రీశైలానికి పాదయాత్రగా వెళుతున్న భక్తులకు దేవస్థానంలో మంగళవారం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈవో పురేందర్‌కుమార్‌ను భక్తులకు భోజనం వడ్డించారు. నియోజకవర్గంలో కాలినడకన వెళ్తున్న వారికి తోచిన సాయం అందిస్తూ దైవ కృపాకటాక్షం పొందుతున్నారని ఈఓ పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ సేవ దృక్పథం అలవర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్ర భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

గట్టు: మండల కేంద్రంలోని సాయిబాబా రైస్ మిల్లు దగ్గర శ్రీశైల పాదయాత్రికులకు మంగళవారం రాత్రి అన్నదానం నిర్వహించారు. 18 ఏళ్లుగా పాదయాత్ర చేస్తున్న కర్ణాటక భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు కేపీ అంబుసా తెలిపారు. బీసీ కాలనీకి చెందిన యువకులు మజ్జిగను అందించారు. అదేవిధంగా తొప్పెల్లమొర్సు స్టేజీ దగ్గర గ్రామస్తుల సహకారంతో అన్నదానం చేశారు.

ధ్యానంతో రుగ్మతలు దూరం



మాట్లాడుతున్న పిరమిడ్ మాస్టర్ బాలకృష్ణారెడ్డి

ఉండవెల్లి: ధ్యానంతో రుగ్మతలు దూరం అవుతాయని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ప్రచారకర్తలు బంగ్లా ఆంజనేయరెడ్డి, బాలకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మారమునగాల, ప్రాగటూరు, శేరుపల్లె, తక్కశిల గ్రామాల్లో ధ్యానంపై అవగాహన కల్పించారు. ధ్యాన అనుభవాలను వివరించారు. ప్రతి నిత్యం ధ్యానం చేయడం క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయన్నారు. చెడు వ్యసనాలు దూరం అవుతాయన్నారు. మానసిక ఒత్తిడి దరి చేరదన్నారు. జీవనశైలిలో మార్పులు చోటుచేసుకుంటాయన్నారు. కార్యక్రమంలో పిరమిడ్ ధ్యాన ప్రచార సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు



అలంపూర్ చౌరస్తాలో చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

అలంపూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. మంగళవారం అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఆయా మండలాలకు చెందిన 44 మంది లబ్ధిదారులకు రూ. 10.30 లక్షల చెక్కులను అందజేశారు. వచ్చే నెలలో వంద పడకల ఆస్పత్రి ప్రజలకు అందుబాటులోకి వస్తోందన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అయిజ: పేదల ఆరోగ్యమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. మంగళవారం మండలంలోని వెంకటాపురంలో వడ్డె లక్ష్మన్న కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధుల నుంచి మంజూరైన రూ.1,50,000 చెక్కును ఆయన అందజేశారు. అదేవిధంగా మండలంలోని కేశవరంలో ప్రమాద వశాత్తు మృతిచెందిన జయన్న మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు పాటుపడదాం

మల్దకల్: టీబీ వ్యాధిగ్రస్తుల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ స్వరూపరాణి సూచించారు. మంగళవారం మండలంలోని వివిధ గ్రామాలలోని ఆరోగ్య ఉపకేంద్రాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీబీ వ్యాధిగ్రస్తులు నెల నెల మందులు క్రమం తప్పకుండా వాడాలన్నారు. అనంతరం టీబీ వ్యాధిగ్రస్తులకు బియ్యంతో పాటు నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్‌లు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

అయిజ: క్షయ వ్యాధి నిర్మూలనకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ విష్ణు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎస్సీ కాలనీ, సంతబజార్‌లలో పీహెచ్‌సీ సిబ్బంది క్షయ వ్యాధిపై కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎం శ్రీదేవి మాట్లాడుతూ జ్వరం, దగ్గు, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఎవరికైనా ఉంటే పీహెచ్‌సీ సిబ్బందికి తెలపాలని సూచించారు. ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది సులోచన, హేమలత, ఓబులమ్మ, నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధి నిర్మూలనకు పాటుపడదామని ఎంపీపీ బీసమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని తక్కశిలలో టీబీ వ్యాధిపై వైద్యులు అవగాహన కల్పించారు. టీబీ లక్షణాలు ఉన్న వారు ఆశాలకు, ఆరోగ్య ఉప కేంద్రాలలో ఏఎన్‌ఎంలకు సమాచారం తెలపాలని కోరారు. సూచనలు, తగిన మందులు అందజేస్తారని తెలిపారు. ఈ నెల 16న కంటి వెలుగు కార్యక్రమం ఏర్పాటు చేస్తునట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచు మద్దమ్మ, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, ఏఎన్‌ఎం నర్సమ్మ, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన



గట్టు మండలం గంగిమాన్‌దొడ్డిలో..

గట్టు: మండలంలోని గంగిమాన్‌దొడ్డి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులు పాఠాలు బోధించారు. కలెక్టర్‌గా రవి, డీఈఓగా మానస, ఎంఈఓగా సందీప్, హెడ్మాస్టర్‌గా మానేశ్వరి, ఉపాధ్యాయులుగా ప్రేమజ్యోతి, సుజని, మౌనిక, వరుణ్‌తేజ్, నందిన, అంజీ, జ్యోతి, నరేంద్ర, మల్లీశ్వరి తదితరులు వ్యవహరించారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ మల్లేష్, సర్పంచు నర్సమ్మ, ఉప సర్పంచు ఆంజనేయులు, కార్యదర్శి వీరేష్‌బాబు, అంగన్‌వాడీ టీచర్ సుగణాబాయి, ఎస్‌ఎంసీ చైర్మన్ రాముడు తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: మండల కేంద్రంలోని లక్ష్మీ కాన్సెప్ట్ స్కూల్‌లో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సుధాకర్‌రెడ్డి, హెచ్‌ఎం విజయ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని గోపల్‌దిన్నె ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాఘవేంద్రారెడ్డి, ఉపాధ్యాయులు బీసన్న, విద్యార్థులు ఉన్నారు.



ధరూరులో ..



గోపల్‌దిన్నెలో..

కంటి వెలుగు శిబిరాల సందర్శన



ఉండవెల్లి మండలం ప్రాగటూరులో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మల్దకల్: మండలంలోని మల్లెందొడ్డి, తాటికుంట గ్రామాలలో కొనసాగుతున్న కంటి వెలుగు కేంద్రాలను మంగళవారం ఎంపీడీఓ కృష్ణయ్య సందర్శించారు. ఆయా గ్రామాలలో 280 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు ప్రణీత, నవీన్‌కుమార్, స్వరూపరాణి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని ప్రాగటూరు, ఇటిక్యాలపాడులో కంటి వెలుగు కార్యక్రమం మంగళవారం కొనసాగింది. ఆయా గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రాగటూరులో 47 మంది, ఇటిక్యాలపాడులో 134 మంది కంటి పరీక్షలు చేసుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు, పాల్గొన్నారు.

పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి

ధరూరు/కేటీదొడ్డి: మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో చేపట్టిన పనులు మందకొడిగా సాగుతున్నాయని, పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు జిల్లా అడిషనల్ కలెక్టర్ అపూర్వ చౌహాన్ ఆదేశించారు. మంగళవారం ఆయన ధన్వాడ మండలంలోని మన్నాపురం యూపీఎస్ పాఠశాల, కేటీదొడ్డి మండలంలోని కొండాపురం, ఇర్కిచేడు, చింతలకుంట గ్రామాలల్లోని ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మన ఊరు మన బడి పనులను పరిశీలించారు. పాఠశాలలో మైనర్ రిపేర్ పనులు పూర్తి అయ్యాయని, తాగునీటి వసతికి సంబంధించి పనులు పెండింగ్‌లో ఉన్నాయని పంచాయతీరాజ్ డీఈ రవీందర్ వివరించారు. విద్యార్థులకు తాగునీటి సమస్య రాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ ప్రభాకర్, ఎంపీడీఓ ఎండీ జబ్బార్, ఎంపీఓ కృష్ణమోహన్, ఎంపీఓ సయ్యద్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, సర్పంచు జయమ్మ, సువర్ణ, హెచ్‌ఎం యోగేందర్, ఎస్‌ఎంసీ చైర్మన్ దుబ్బన్న పాల్గొన్నారు.